

ఎరువుల నిల్వల పరిశీలన

నాదెండ్ల: సాతులూరులోని ఎరువుల రైల్వే రేక్ పాయింట్‌ను డీఏఓ ఎం.జగ్గారావు సోమవారం సందర్శించారు. సరుకు నిల్వల రికార్డులను ఆయన పరిశీలించారు.



దుర్గమ్మకు విరాళాలు

విజయవాడ వెస్ట్ (ఇంద్రకీలాద్రి): కనక దుర్గమ్మకు పలువురు భక్తులు సోమవారం విరాళాలు సమర్పించారు. ఆలయ అభివృద్ధి, నిత్యాన్నదాన పథకాలకు విరాళాలిచ్చారు.



స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పెనమలూరు: మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం కృష్ణా జిల్లా పోరంకిలో జేసీ గీతాంజలి శర్మతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

ఆర్‌టీఈ ప్రవేశాల రెండో జాబితా విడుదల

నరసరావుపేట ఈస్ట్: విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 1వ తరగతి ఉచిత ప్రవేశాల రెండో జాబితా విడుదల చేశారు. ఈ మేరకు డీఈవో ఎల్.చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలో 132 మంది విద్యార్థులు ఎంపికైనట్టు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు 31వ తేదీలోగా సంబంధిత సర్టిఫికెట్లను ఆయా పాఠశాలల్లో సమర్పించి, తమ పిల్లల ప్రవేశాలను నిర్ధారించుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత మండల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ కార్యాలయాలలో సంప్రదించాలని తెలిపారు.

మట్టి గణపతిని పూజిద్దాం



నరసరావుపేట: ఈ ఏడాది సహజ సిద్ధమైన రంగులతో చేసిన మట్టి గణపతినే అందరం పూజిద్దామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన ప్రచార పోస్టర్‌ను కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. పర్యావరణాన్ని రక్షించేందుకు అందరూ సహకరించాలని పేర్కొన్నారు. డీఆర్‌ఓ ఏకా మురళి, ఏపీపీసీబీ పర్యావరణ ఇంజినీరు ఎండీ నజీమాబేగం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, సరిపడా ఇప్పటికే అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పష్టం చేశారు. సోమవారం అధికారులు, తహసీల్దార్లతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాకు 90 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఆర్‌ఎస్‌కే స్థాయిలో రైతు ఎంత పంట వేశారు, ఎంత యూరియా అవసరం, ఎంత తీసుకున్నారు, నిల్వలు వంటి విషయాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వినియోగంపై రైతులకు ఆర్‌ఎస్‌కే సిబ్బంది అవగాహన కలిగించాలని తెలిపారు. ఎరువుల పర్యవేక్షణకు మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్‌హెచ్‌ఓ, వ్యవసాయ అధికారులను బృందంగా నియమించామని తెలిపారు. అక్రమ నిల్వలపై నిఘా ఉంచాలని, ఇప్పటికే విజిలెన్సు అధికారులు కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. మండల ప్రత్యేకాధికారులు బృందాలను సమీక్షించాలని తెలిపారు. కొరత అనే మాట వినపడకూడదని సూచించారు.

మల్లేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



పెదకాకాని: పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్‌ఎన్ చక్రవర్తి దంపతులు ప్రత్యేక పూజలు జరిపించారు. వారికి ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన న్యాయమూర్తి దంపతులు ముందుగా రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి అభిషేక సేవ, అమ్మవారికి అష్టోత్తరం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 8,216 క్యూసెక్కులు సోమవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 306 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,875, క్యూసెక్కులు, తూర్పు కాలువకు 712, పశ్చిమ కాలువకు 292, నిజాంపట్నం కాలువకు 528, కొమ్మూరు కాలువకు 2,940 క్యూసెక్కులు, బ్యారేజీ నుంచి సముద్రంలోకి 3,15,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

అయినవారి కోసమేనా

టెండర్ల వాయిదాల పర్వం

- రూ.793.21 కోట్లతో పది పనులకు టెండరు నోటీసు
- ఇందులో మూడు సేవలు, ఏడు నిర్మాణ, నిర్వహణ పనులు
- రూ.683.33 కోట్లతో రాజధానిలో సమ్మిళిత పనులు
- రూ.109.88 కోట్లతో విజయవాడ, గుంటూరులో 4 రోడ్ల నిర్మాణాలు
- గుంటూరు ఐఆర్‌ఆర్ పనికి ఆరు టెండర్లు దాఖలు
- ఫైనాన్షియల్ బిడ్ ఓపెన్‌కు మీనమేషాలు
- విజయవాడలో మూడు పనులకు మూడు వాయిదాలు టెండర్లు
- ఏపీసీఆర్‌డీఏ టెండర్లలో తిరకాసులెన్నెన్నో...



ఆర్‌టీవో ఆఫీసు వద్ద ఇన్నర్‌రింగ్ రోడ్ సర్కిల్

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఏపీ సీఆర్‌డీఏ ఆహ్వానించిన టెండర్లను నిర్ణీత సమయంలో తెరవకుండా మీనమేషాలు లెక్కిస్తూ తమకు అనుకూలురైన కాంట్రాక్టర్ల కోసం ఎదురుచూస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్‌కు బిడ్లు దాఖలైనప్పటికీ సహేతుక కారణాలేవీ లేకుండానే ఫైనాన్షియల్ బిడ్ తెరవకుండా వాయిదా వేస్తుండగా, కొన్ని టెండర్లకు సంబంధించి సాంకేతిక బిడ్‌లను కూడా ఓపెన్ చేయడం లేదని టెండరుదారులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. తమకు అనుకూలురైన బడా కాంట్రాక్టర్లకు పనుకట్టబెట్టడానికే వాయిదాల వ్యవహారాలను ఏపీసీఆర్‌డీఏ ఉన్నతాధికారుల ద్వారా కూటమిలోని పెద్దలు కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లను పక్కన పెట్టి అన్ని పనులను ఒకటిగా చేసి పెద్దమొత్తంతో టెండరు పిలిచి బడా కంపెనీలకు అప్పజెప్పి భారీస్థాయిలో పర్సంటేజీలు రాబట్టుకోవచ్చనే వ్యూహంలో భాగంగానే వాయిదాల పర్వమని స్పష్టమవుతోంది.

పది పనులకు టెండర్లు

- అమరావతి రాజధాని, విజయవాడ, గుంటూరు నగరాలలో పది పనుల కోసం ఏపీసీఆర్‌డీఏ రూ.793.22 కోట్లతో టెండర్లను ఆహ్వానించింది. పై మొత్తంతో ఏడు నిర్మాణ, నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉండగా... తక్కిన మూడు టెండర్లు సేవలకు సంబంధించినవి. నిర్మాణ, నిర్వహణ పనులకుగాను టెండరు డాక్యుమెంట్లను జూలై 11 నుంచి ఆగస్టు 8వ తేదీలోగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. నిర్దేశిత బిడ్లకు ఆగస్టు ఒకటి నుంచి 13వ తేదీలోగా టెండర్లు దాఖలు చేయడానికి గడువు విధించింది.
- గుంటూరు జేకేసీ కాలేజీ మార్గంలోని స్వర్ణ భారతి నగర్ వద్ద నుంచి పెద్దపలకలూరు వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు మూడో ఫేజ్ కింద నిర్మాణానికి రూ.34,87,28,545కు టెండరు పిలిచింది. ఆగస్టు ఏడో తేదీ టెండరు దాఖలుకు గడువిచ్చింది. టెక్నికల్ బిడ్డు తెరవగా ఆరు టెండర్లు దాఖలైనట్లు గుర్తించారు. టెండరు నిబంధనల ప్రకారం 8వ తేదీ ఫైనాన్షియల్ బిడ్‌ను తెరవాలి. ఇప్పటివరకు ఆ పనిచేయలేదు. కారణాలేంటని తాము పలుసార్లు సంబంధిత అధికారులను సంప్రదించినా సమాచారం ఇవ్వడం లేదని టెండరుదారులు 'సాక్షి'కి తెలిపారు.
- విజయవాడ నగరంలోని బల్లెంవారివీధి జంక్షన్ నుంచి నిడమానూరు మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు (హెచ్‌టీ లైన్ రోడ్) బీటీ హాట్ మిక్స్‌తో రోడ్డు విస్తరణ, సెంట్రల్ డివైడర్ వంటి పనులకు రూ. 26,51,89,656 మేరకు టెండరు ఆహ్వానించింది. అదేవిధంగా మహానాడు రోడ్డు నుంచి బల్లెంవారి వీధి నుంచి పోరంకి, నిడమానూరు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, ఇతర పనులకు రూ. 25,52,45,567 మరో టెండర్‌ను పిలిచింది. బందరు రోడ్డు నుంచి హెచ్‌టీ లైన్ జంక్షన్ వరకు బల్లెంవారి వీధి రోడ్డు విస్తరణ, సెంట్రల్ డివైడర్, లైటింగ్ పనుల నిమిత్తం 22,96,21,066 టెండరు ఆహ్వానించింది. పై మూడు పనులకు సంబంధించి ఆగస్టు 11వ తేదీ టెక్నికల్ బిడ్ తెరవనున్నట్లు పేర్కొన్నప్పటికీ ఆ మేరకు చేయలేదు. ఏ కారణం లేకుండానే 19వ తేదీ టెక్నికల్ బిడ్ ఓపెన్ చేస్తున్నట్లు చెప్పిన అధికారులు అలా చేయకపోగా మరోసారి ఈ నెల 29వ తేదీకి వాయిదా వేయడం పరిశీలనాంశం. మూడు పనులకు సంబంధించిన టెక్నికల్ బిడ్‌ను ఓపెన్ చేయకుండా మూడు పర్యాయాలు ఎందుకు వాయిదా వేశారనేది అంతు బట్టని అంశంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు ఫైనాన్షియల్ బిడ్ ఓపెన్ చేయకపోవడం, విజయవాడలోని మూడు పనుల టెండర్లను ఇలా వాయిదాలు వేయడం వెనుక కూటమి ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్లు స్పష్టమవుతోందని అంటున్నారు. బడా గుత్తేదారులకు పనులు అప్పగించాలనే వ్యూహంతో ఉన్నప్పుడు ఏపీ సీఆర్‌డీఏ టెండర్లు పిలవడం ఎందుకని నిలదీస్తుండటం చర్చనీయాంశంగా మారింది.



స్వర్ణభారతి నగర్ నుంచి పేరేచర్ల వెళ్లే ఇన్నర్‌రింగ్ రోడ్

పేదింటి 'ఆశాజ్యోతి'

- తొలి ప్రయత్నంలోనే డీఎస్సీలో అర్హత
- కన్నవారి కష్టానికి ప్రతిఫలమన్న యువతి



ఆశాజ్యోతికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

పెదకూరపాడు: పేదరికం ఉన్నా పట్టుదలతో ఏదైనా సాధించ వచ్చునని నిరూపించారు మన్నం ఆశాజ్యోతి. తల్లిదండ్రులు నిరుపేదలైనా ఎంతో కష్టపడి ముగ్గురు ఆడ బిడ్డలను చదివించారు. వీరిలో పెద్ద కుమార్తె ఆశాజ్యోతి తొలి ప్రయత్నంలోనే ఇటీవలి డీఎస్సీ పరీక్షలో అర్హత సాధించారు.

ఒకేసారి మూడు అవకాశాలు

పెదకూరపాడు మండలం జలాల్పురం గ్రామానికి చెందిన మన్నం చిన్నప్ప, లూర్దుమేరీలకు ముగ్గురు ఆడబిడ్డలు. పెద్ద కుమార్తె ఆశాజ్యోతి చిన్నతనం నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించారు. ప్రాథమిక విద్యను జలాలపురం గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ స్కూల్‌లో, పదో తరగతిని అమరావతి గురుకుల పాఠశాలలో పూర్తిచేశారు. ఆ తర్వాత ఇంటర్మీడియట్ రామకృష్ణాపురం గురుకుల పాఠశాలలో, డిగ్రీ తిరుపతి మహిళా యూనివర్సిటీలో చదివారు. తొలి ప్రయత్నంలోనే ఎస్‌ఏ బయాలజీలో 79.06 మార్కులతో 12వ ర్యాంకు, టీజీటీ బయాలజికల్ సైన్స్‌లో 76.13 మార్కులతో 18వ ర్యాంకు, టీజీటీ జనరల్ సైన్స్‌లో 68.13 మార్కులతో 15వ ర్యాంకు సాధించారు.

చెల్లెళ్లను కూడా తీర్చిదిద్దుతా

ఆశాజ్యోతి మాట్లాడుతూ.. ముగ్గురు ఆడ బిడ్డలం అయినా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ నమ్మకంతో కష్టపడి చదివించారన్నారు. వారి కష్టాల ఫలితమే ఈ విజయమని తెలిపారు. వారి స్ఫూర్తితో చెల్లెళ్లను కూడా విద్యావంతులుగా తీర్చిదిద్దుతానన్నారు.

మానవత్వం లేని కూటమి సర్కార్

- లక్షల మంది దివ్యాంగులకు అడ్డగోలుగా పెన్షన్ల రద్దు చేయడం తగదు
- ఇదేనా కూటమి నేతలు రాష్ట్రంలో అందిస్తున్న సుపరిపాలన?
- వైద్యులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు బెదిరించడం దారుణం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల
- పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టర్‌కు పి. అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ గజ్జల

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం వచ్చిన 14 నెలల కాలంలో సుమారు 5 లక్షల మంది దివ్యాంగులు, ఇతరుల పింఛన్లు రద్దు చేయటం దారుణమైన విషయమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. దివ్యాంగుల పింఛన్లపై కూటమి ప్రభుత్వ విధానాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డితో కలసి కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ సమావేశంలో కలెక్టర్ పి. అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. తడాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అచ్చంపేటకు చెందిన రూపేష్ అనే బాలుడు కాళ్లు, చేతులు పనిచేయని మానసిక దివ్యాంగుడన్నారు. ఆ పరిస్థితిలో ఉన్న అతడి పింఛన్ కూడా తీసేశారని మండిపడ్డారు. ఇదెక్కడి సుపరిపాలన అని ప్రశ్నించారు. మంచంలో కదల్లేని స్థితిలో ఉన్న దివ్యాంగుల పింఛన్లు సైతం తీసివేసి అమానవీయంగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిడుగురాళ్ల చెందిన అస్మిత అనే అమ్మాయి మంచంలో కదలలేని పరిస్థితి ఉందని, చూపు కూడా లేదని, రూ.15 వేల పింఛన్‌ను రూ.6 వేలకు తగ్గించారన్నారు. పెన్షన్లను తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. బాధితులు గత పది, పదిహేనేళ్ల నుంచి పింఛన్లు తీసుకుంటున్నవారేనని చెప్పారు. కూటమి ప్రభుత్వ పెద్దల బెదిరింపులకు భయపడి డాక్టర్లు వైకల్య శాతం తగ్గించి వేశారని పేర్కొన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా ఈ విషయం చెప్పారని, ఎవరైతే ఎక్కువ శాతం చూపిస్తున్నారో అలాంటి డాక్టర్లపై విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారన్నారు. ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వకుండానే ఐదు లక్షల మందికి తొలగించటం తగదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మానవత్వంతోనైనా స్పందించి పింఛన్లు పునరుద్ధరించాలన్నారు. పల్నాడు జిల్లాకు సంబంధించి 6,300 దివ్యాంగుల పింఛన్లలో 3,200 మందికి నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. కొంత మంది పేర్లు జాబితా నుంచి తీసేశారని, మరికొంత మందికి రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. నరసరావుపేట మున్సిపాలిటీకి సంబంధించి 830 మందికి రీ వెరిఫికేషన్ నోటీసులు వచ్చాయన్నారు.

వీరిపైనా రెడ్‌బుక్ రాజ్యాంగమా?

సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డి మాట్లాడుతూ కనీసం దివ్యాంగుల మీదైనా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయవద్దని కోరారు. దివ్యాంగుల పట్ల మానవత్వంతో ప్రవర్తించాల్సి ఉందన్నారు. వైకల్య శాతం తగ్గించకుండా తప్పనిసరిగా రూ.15 వేలు ఇవ్వాలని కోరారు. అచ్చంపేటలో రీ వెరిఫికేషన్ కోసం నోటీసు ఇచ్చిన రూపేష్ అనే బాలుడిని పరీక్షకు తీసుకురావడం కూడా కష్టమే అన్నారు. దయచేసి వెంటనే ఆ పిల్లవాడికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని నాయకులు కోరారు. పల్నాడు జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు షేక్ అహ్మద్ (గోరే), నకరికల్లు మండల పార్టీ కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షులు షేక్ కరీముల్లా, మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అచ్చు శివకోటి, పానుగోటి వెంకట్రావు, నియోజకవర్గ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

- పీజీఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్
- అధికారులతో కలసి 146 అర్జీలు స్వీకరణ



అర్జీదారుల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీ ఆర్‌ఎస్ ద్వారా 146 అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా, అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలు పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పంపాలని సూచించారు. డీఆర్‌ఓ ఏకా మురళి, ఆర్డీఓ కె.మధులత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పింఛను తొలగిస్తారనే ఆత్మహత్య

- చాగంటివారిపాలెంలో మృతుడి భార్య రామలింగమ్మ ఆవేదన
- ముప్పాళ్ళ పోలీసు స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు
- మృతుడికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ గజ్జల నివాళి
- బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా



రామలింగారెడ్డి భౌతికకాయానికి నివాళులు



ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

ముప్పాళ్ళ: పింఛను తొలగిస్తారనే దిగులుతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నారని పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన మారూరి రామలింగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగ పెన్షన్ పొందుతున్న రామలింగారెడ్డికి వెరిఫికేషన్ పేరిట నోటీసులు ఇవ్వడంతో పెన్షన్ తొలగిస్తారనే చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయం తెలియడంతో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి సోమవారం రాత్రి చాగంటివారిపాలెంలో రామలింగారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రామలింగమ్మ మాట్లాడుతూ కేవలం కూటమి ప్రభుత్వం, మండల అధికారి వల్లనే తన భర్త చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ముప్పాళ్ళ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

కుటుంబ గొడవగా చిత్రీకరణ

అనంతరం సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ పెన్షన్ ఆపేస్తారని నోటీస్ ఇవ్వటంతో తట్టుకోలేక రామలింగారెడ్డి మృతి చెందారన్నారు. నోటీసు ఇవ్వడంతో దిగులుతో ఆహారం కూడా సరిగ్గా తీసుకోలేదని రామలింగమ్మ చెబుతున్నట్లు గుర్తుచేశారు. రామలింగారెడ్డి మృతి చెందడంతో పరామర్శించేందుకు సోమవారం రాత్రి 8 గంటలకు తాము వస్తే మధ్యాహ్నం నుంచే టీడీపీ వారు ఇది ఇంటి గొడవ అని, దీనిని సుధీర్ భార్గవరెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇష్యూ చేస్తున్నారని పేర్కొన్నారు. 2022 డిసెంబర్ నుంచి రామలింగారెడ్డికి పెన్షన్ వస్తోందన్నారు. అప్పటి ప్రభుత్వ వైద్యుడు పరీక్షించి 40 శాతం ఉందని నిర్ధారించారన్నారు. ఇప్పుడు రీవెరిఫికేషన్ సాకు చెప్పి పెన్షన్ తొలగించటం చూస్తున్నామని పేర్కొన్నారు. 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందని పెన్షన్ తొలగింపునకు నోటీసు ఇవ్వడంతో బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తుచేశారు. అచ్చంపేటలో తల్లిదండ్రులపై ఆధారపడిన బాలుడికి కూడా దివ్యాంగ పెన్షన్ తీసేశారని పేర్కొన్నారు. పెద్ద తురకపాలెంలో మహిళకు కళ్లు కనిపించక, కాళ్లు పనిచేయక పూర్తిగా మంచంపై ఉందన్నారు. మహిళకు వైకల్యాన్ని 90 శాతం నుంచి 56 శాతానికి తగ్గించారన్నారు. అంటే రూ.15 వేల పింఛనును రూ.6 వేలకు తెచ్చారన్నారు. ఇలా పెన్షన్‌లు తొలగించే ప్రాసెస్‌లోనే ఇలా చేశారన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ తరఫున భరోసా ఇచ్చారు. లీగల్ సెల్ జిల్లా అధ్యక్షురాలు రోళ్ళ మాధవి, పార్టీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి (చిన్నా), భవనం రాఘరెడ్డి,గొలమారి వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మండపాల నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలి

– జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు



నరసరావుపేట రూరల్: వినాయక ఉత్సవాల నిర్వాహకులు మండపాల ఏర్పాటు, ఊరేగింపుల కోసం తప్పనిసరిగా పోలీసుల ముందస్తు అనుమతి తీసుకోవాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు సింగిల్ విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందవచ్చని తెలిపారు. మండపాల ఏర్పాటు కోసం ఎటువంటి ఫీజులు ఎవరికి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతం వాతావరణంలో నిర్వహించుకునేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పరిమితికి మించి సౌండ్స్ సిస్టమ్స్ ఉపయోగించవద్దని సూచించారు. అశ్లీలతకు తావిచ్చే కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. నిర్దేశిత ప్రదేశంలో పోలీసుల ఇచ్చిన తేదీ, సమయం నిర్వహకులు పాటించాలని తెలిపారు. మద్యం సేవించి నిమజ్జనంలో పాల్గొనవద్దని, చిన్నారులు పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై కూడా ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1300 మండపాలకు దరఖాస్తులు రాగా 500 మండపాలకు అనుమతులు మంజూరు చేసినట్టు తెలిపారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజల ఆస్తులకు రక్షణ కవచంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజలు వేరే ఊర్లకు వెళ్లే సమయంలో ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని తీసుకువచ్చినట్టు తెలిపారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు ముందస్తు సమాచారాన్ని అందిస్తే పోలీసులు ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని ఉచితంగా కల్పిస్తారని తెలిపారు.

‘మట్టి’ మేలు తలపెట్టవోయ్..!

వినాయక చవితి సందడి మొదలైంది. పల్లె, పట్టణం, వీధి, కాలనీ అనే తేడా లేకుండా వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పలుచోట్ల ఉత్సవ పందిళ్లు వెలుస్తున్నాయి. రంగుల విగ్రహాలు దర్శనమిస్తుండటంతో కొనుగోళ్లకు యువత ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పీఓపీ)తో తయారైన విగ్రహాల వినియోగం మంచిది కాదని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

మట్టి వినాయక ప్రతిమలు పర్యావరణ హితం



వెన్నాదేవి వద్ద విక్రయానికి సిద్ధం చేసిన పీఓపీ వినాయక విగ్రహాలు

- జిల్లాలో ప్రారంభమైన చవితి సందడి
- పీఓపీతో పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు
- మట్టి విగ్రహాలను వినియోగించాలని ప్రచారం

సత్తెనపల్లి: వినాయక చవితి పండుగ అంటే సంబరాలు అంబరాన్ని అంటుతాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ప్రజలు కలసిమెలసి చవితి ఉత్సవాలను ఆనందంగా జరుపుకొంటారు. ఈ నెల 27వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అన్ని ప్రాంతాల్లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. వేడుకలకు ప్రధానంగా గణపయ్య విగ్రహం ఉండాలి. చాలా మంది మార్కెట్లో దొరికే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన రంగుల విగ్రహాలను తీసుకొచ్చి పూజిస్తారు. రసాయనాలతో తయారు చేసిన ఈ విగ్రహాల కంటే మట్టితో రూపొందిన వాటిని పూజిస్తే పర్యావరణానికి ఎంతో శ్రేయస్కరమని విద్యావంతులు చెబుతున్నారు. సహజసిద్ధంగా ప్రకృతిలో దొరికే ముడి సరుకుతో చేసే వినాయక ప్రతిమలు శ్రేష్టం.

మట్టితో విడదీయరాని బంధం..

మానవ మనుగడ ప్రకృతితో ముడిపడి ఉంది. ప్రకృతి ఆరాధనతో మొదలైన పూజలు ఇప్పుడు విగ్రహారాధన వరకు వచ్చాయి. సాధారణంగా మిగతా దేవతామూర్తుల విగ్రహాలను కళాకారులు రాయితో మలుస్తారు. వినాయక చవితి ఉత్సవాల అనంతరం స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేయాల్సి ఉన్నందున సులువుగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేస్తున్నారు. ఇటీవల విగ్రహాల ఏర్పాటు సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. జిల్లాలో వేల సంఖ్యలో పెద్ద విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి ముప్పు ఉందని విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.



సత్తెనపల్లి నాగన్నకుంటలో కొలువుదీరిన నారికేళ గణపతి

కొంతలో కొంత మార్పు...

గతంలో కంటే ప్రస్తుతం కొంత మార్పు వచ్చిందనే చెప్పాలి. వినాయక చవితి సందర్భంగా ఇళ్లల్లో కొలువు తీర్చే గణపయ్యలను మట్టితో చేస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కళాకారులు మట్టితో చిన్న విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటికి కూడా మంచి డిమాండ్ ఉంది. వీధుల్లో, గ్రామాల్లో ఏర్పాటు చేసే భారీ గణపయ్యలను కూడా మట్టితో చేసేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. సహజ సిద్ధంగా లభించే బంకమట్టితో చేసే విగ్రహాలు త్వరగా నీటిలో కరిగి పోతాయి. నిమజ్జనం చేసినా నీటి వనరులకు ఎలాంటి నష్టం ఉండదు. ఎలాంటి కాలుష్యం ఉండదు. స్వచ్ఛమైన గాలి, వాతావరణాన్ని ఆస్వాదించవచ్చు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలు త్వరగా నీటిలో కరగవు. రసాయన అవశేషాలు ఉంటాయి. నిమజ్జనంతో నీరు కలుషితం అవుతుంది. నీటిలో జీవరాశులు కూడా రోగాల బారిన పడతాయి. ఈ నీటిని తాగితే వ్యాధులకు దారితీస్తుంది. అలాగే చర్మవ్యాధులు సోకుతాయి. పంట పొలాలకు ఈ నీరు చేరితే దిగుబడులు తగ్గిపోతాయి.

అవగాహన కల్పిస్తున్నాం



మట్టి వినాయక విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తున్నాం. మా వంతు బాధ్యతగా ప్రతి సంవత్సరం మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

– కొత్తా రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు, ఆర్యవైశ్య యువజన సంఘం

పీఓపీ విగ్రహాలతో ప్రమాదం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలకు యువత ఆకర్షితులు అవుతున్నారు. వాటి వల్ల భావితరాల మనుగడకే పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పీఓపీ విగ్రహాలను నిమజ్జనం చేసే నీళ్లను వినియోగిస్తే అనేక రకాల వ్యాధులు సోకుతాయి. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి.

– మాదా మల్లికార్జునరావు, అధ్యక్షుడు, అభ్యుదయ విజ్ఞాన సమితి

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ శ్రీనివాసరావు పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఆర్థిక, కుటుంబ, మోసం తదితర సమస్యలకు చెందిన 120 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జేవీ సంతోష్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

పది నెలల నుంచి నా చెల్లి కనిపించడం లేదు



పది నెలలుగా నా సోదరి గిరిజ కనిపించడం లేదు. నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందించలేదు. గిరిజను గ్రామంలోని రాఘవకు ఇచ్చి వివాహం చేయగా ముగ్గురు సంతానం ఉన్నట్టు తెలిపింది. గిరిజకు అనారోగ్యంగా ఉండటంతో పూజలు జరిపించామని, ఆ తరువాత నుంచి కనిపించడం లేదు.

–యాతగిరి ఉమామహేశ్వరి, ఇస్సప్పాలెం

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

నా తమ్ముడు రవీంద్రబాబుకు ఉద్యోగం ఇప్పిస్తానని ఫిరంగిపురానికి చెందిన పొలంకి బాజీబాబు, కింగ్‌బాబు చెప్పడంతో రూ.6 లక్షలు చెల్లించాం. అయితే ఇప్పటి వరకు ఉద్యోగం ఇప్పించకపోవడంతో నగదును తిరిగి ఇవ్వమని అడిగితే వారి నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదు. నగదు ఇప్పించి న్యాయం చేయండి.

–ధర్నాసీ దాసు, కొండవీడు, యడ్లపాడు మండలం

నా భర్త మోసం చేసి వేరే పెళ్లి చేసుకున్నాడు



గ్రామానికి చెందిన మణికంఠతో పదేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు సంతానం. పని నిమిత్తం ప్రత్తిపాడు మండలం నిమ్మగడ్డవారిపాలెం వెళ్లాం. ఇంటి ఎదురు ఉండే యువతితో నా భర్త వెళ్లిపోయి ఇప్పుడు వచ్చాడు. ఆమెను వివాహం చేసుకున్నాడు. నా అత్తామామకు చెందిన ఎకరం భూమి కూడా యువతి పేరిట రిజిస్ట్రేషన్ చేశాడని తెలిసింది. నాకు, నా పిల్లలకు న్యాయం చేయాలి.

–కుమరగిరి గోవిందమ్మ, నరమాలపాడు, కారంపూడి మండలం

నకిలీ జీపీతో భూమిని విక్రయించాడు



1985లో చీతిరాల సుబ్రహ్మణ్యం పేరుతో జీపీ చేసినట్టుగా నకిలీ పత్రాలు సృష్టించి నాకు చెందిన 1.50 ఎకరాల భూమిని గతేడాది గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి నాగార్జునరెడ్డికి విక్రయించాడు. నకిలీ పత్రాలు సృష్టించి భూమిని విక్రయించిన చీతిరాల సుబ్రహ్మణ్యంపై చర్యలు తీసుకోవాలి.

–గోగిరెడ్డి హనుమంతరెడ్డి, చాట్రగడ్డపాడు, వినుకొండ మండలం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల వినతి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు

నరసరావుపేట: కూటమి ప్రభుత్వంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గరల్స్ కో కన్వీనర్ నవిత, అమూల్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా రెండేళ్లు దగ్గర పడుతున్నా విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఎన్నికల సందర్భంగా యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి రూ.6,400 కోట్లు తక్షణమే విడుదల చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఆ హామీని మైమార్చి పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. జిల్లాలో దాదాపుగా రెండు వేల మంది పైబడి బీసీ, ఎస్టీ, ఎస్సీ మైనారిటీ వర్గాల సంబంధించిన విద్యార్థులు సంక్షేమ హాస్టల్స్‌లో విద్యఅభ్యసిస్తున్నారని వివరించారు. హాస్టల్స్ నిర్వహణ అధ్వానంగా ఉందని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన ట్రంకు పెట్టెలు, బెడ్ షీట్లు, దోమతెరలు ఇతర వస్తువులు సరఫరా చేయలేదని అన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలు కనుకూలంగా ప్రతి విద్యార్థికి నెలకు రూ.3 వేలు మెస్ బిల్లులు పెంచాలని, జీఓ నంబర్ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ అందించాలని, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎయిడెడ్ విద్యాసంస్థలు ప్రైవేటు పరం చేసే సందర్భంలో విద్యార్థి సంఘాల పోరాటం నిర్వహిస్తే ఆ పోరాటానికి మద్దతు తెలిపిన లోకేష్ ప్రస్తుతం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేజీ నుంచి పీజీ ఉచితంగా బస్సుపాస్ అందజేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పీడీ పోస్టులు భర్తీ చేయాలని, కళాశాల సమయం పాత పద్ధతిలోనే కొనసాగించాలని, డిగ్రీ విధానంలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దుచేయాని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు రోహిత్, రామకృష్ణ, నాగూర్ పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు చేస్తున్న ఎమ్మెల్యే జీవీ

వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వినుకొండ: నియోజకవర్గంలో కూటమి నాయకులు హత్యా రాజకీయాలు ప్రోత్సహిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులపై నిందలు మోపడంపై ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమ్మిరెడ్డి అంజిరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి పగడాల వెంకట్రామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎంఎస్ ప్రసాద్ సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టి.అన్నారంలో పార్టీ బూత్ కన్వీనర్ వెంకట ప్రసాద్‌పై టీడీపీ నాయకులు హత్యాయత్నంపై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. హత్యాయత్నానికి పాల్పడిన గోపి, రామయోగి, టీడీపీకి చెందినవారు కాదా అని ప్రశ్నించారు. గతంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్మన్‌తో సహా పలువురు వైఎస్సార్ సీపీలో ఉన్నారని, ప్రస్తుతం టీడీపీలో చేరిన విషయాన్ని గుర్తుచేశారు. పాత ఫొటోలతో సోషల్ మీడియాలో పెట్టి వైఎస్సార్ సీపీకి అంటగట్టే ప్రయత్నాలు సిగ్గుచేటు అని విమర్శించారు.

రషీద్ హత్య నుంచి...

వినుకొండలో రషీద్ హత్య కేసు నుంచి టి.అన్నారం వెంకట ప్రసాద్‌పై హత్యాయత్నం వరకు ఘటనలు వెనుక కూటమి ప్రభుత్వం హస్తం లేదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పెద్దన టుడని విమర్శించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బొల్లాకు నటించడం చేతకాదని అభివృద్ధి చేయడమే తెలుసన్నారు. వినుకొండలో తాగునీటి సమస్య దగ్గర నుంచి అనేక అభివృద్ధి పనులు చేసిన ఘనత బొల్లాకే దక్కుతోందని చెప్పారు. ఏబీఎం ఆస్తులపై హైకోర్టు ఆర్డర్లు ఉన్నా అక్రమ కట్టడాలు సాగుతున్నాయని, మున్సిపల్ కమిషనర్‌ను అడిగితే ఆ కట్టడాలకు ప్లాన్ అప్రూవల్ లేవని చెబుతున్నారని విమర్శించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే జీవీ ఇలాంటి హత్యారాజకీయాలు సమర్థించడం మంచిది కాదన్నారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, మాజీ సర్పంచి కొత్త కృష్ణారెడ్డి, టౌన్ కన్వీనర్ కొత్తమాసు శివ, కొత్త వీరాంజనేయరెడ్డి, వంగూరి ప్రసాద్ పాల్గొన్నారు.

యోగా పోటీల్లో సత్తెనపల్లి వాసుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో విజేతలతో గురువు రమేష్

సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఐదుగురు ప్రతిభ కనబరిచారు. సత్తెనపల్లి శక్తి యోగశాల నిర్వాహకుడు రమేష్ ఆధ్వర్యంలో 6వ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రస్థాయి యోగాసనం స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడులో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించారు. రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో లెగ్ బ్యాలెన్స్ విభాగంలో పులహరి బాలాజీ, ఫార్వర్డ్ బెండ్ విభాగంలో వల్లూరి శ్రీనివాసరావు, సుపైన్ విభాగంలో పులికొండ శ్రీనివాసరావు, ఎం.సునీల్ కుమార్, టిస్టింగ్ విభాగంలో ధనేకుల సాంబశివరావు ప్రతిభ కనబరిచారు. విజేతలు నిర్వాహకుల నుంచి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన శక్తి యోగశాల నిర్వాహకుడు రమేష్‌ను సత్కరించారు. రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపిన ఐదుగురు విజేతలతోపాటు గురువు రమేష్‌ను సోమవారం పట్టణంలోని తోటి యోగా సభ్యులు, నిత్య యోగా సాధకులు ప్రత్యేకంగా అభినందించారు.

పండుగ తరువాతే పరిశీలన

- 28 నుంచి డీఎస్సీ-2025 మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన
- ఉమ్మడి జిల్లాలో భర్తీ చేయనున్న 1,143 పోస్టులు
- గుంటూరు ఏసీ కళాశాలలో ముమ్మర ఏర్పాట్లు



ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ వినాయకచవితి పండుగ తరువాతే ప్రారంభం కానుంది. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ-2025 ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులతో వివిధ కేటగిరీల వారీగా ఆయా పోస్టులకు ఎంపికైన వారికి పాఠశాల విద్యాశాఖ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఈనెల 28 నుంచి చేపట్టనుంది. విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం ప్రారంభం కావాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను మంగళవారానికి వాయిదా వేసిన అధికారులు వినాయకచవితి పండుగ సెలవు దృష్ట్యా మరోసారి వాయిదా వేశారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను గురువారం నుంచి చేపట్టేందుకు షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ‘సాక్షి’కి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో 1,143 పోస్టులు

డీఎస్సీ-2025 ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో 1,143 పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ 622, ఎస్జీటీ 521 ఉన్నాయి. వీటితో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరో 16 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా తెలుగు 42, హిందీ 57, ఇంగ్లిష్ 69, మ్యాథ్స్ 35, ఫిజికల్ సైన్స్ 58, బయాలాజికల్ సైన్స్ 86, సోషల్ 109, ఫిజికల్ ఎడ్యుకేషన్ 166తో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 521 ఉన్నాయి.

ఏసీ కళాశాల వేదిక

ఉమ్మడి గుంటూరు జిల్లాలో భర్తీ చేయనున్నట్లు డీఎస్సీ నోటిఫికేషన్‌లో పొందుపర్చిన 1,143 పోస్టులకు గతంలో 25,067 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ పోస్టులకు గల అర్హత ప్రాతిపదికన సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఒక దరఖాస్తు దాఖలు చేసిన అభ్యర్థులతో పాటు రెండు పోస్టులకు కలిపి దాఖలు చేసిన దరఖాస్తులతో కలుపుకొని ఆన్‌లైన్‌లో మొత్తం 43,570 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో పురుషులు 8,431, మహిళా అభ్యర్థులు 16,636 మంది ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 6వ తేదీ నుంచి జరిగిన ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పరీక్షల ఫలితాలను ఇటీవల విడుదల చేశారు. వీరిలో ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను గురువారం నుంచి గుంటూరులోని ఏసీ కళాశాలలో చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు విద్యాశాఖ కార్యాలయం ద్వారా నేరుగా సమాచారాన్ని పంపుతారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు చేపడతామని డీఈఓ సీవీ రేణుక చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం

జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు

నరసరావుపేటరూరల్: ప్రకృతి వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం ఆరోగ్యవంతమైన పంటలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జగ్గారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్టాత్మక కార్యక్రమం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ద్వారా జిల్లాలో ఉద్యమంలా రైతుల్లోకి తీసుకువెళ్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 82,619 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగు లక్ష్యంగా విధించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 65వేల ఎకరాల్లో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి, రాష్ట్ర కార్యాలయ అధికారి మధుమోహన్, అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, వైఆర్‌ఎఫ్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి



ఈపూరు(శావల్యాపురం): రెండు బైకులు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఈపూరు మండలం వనికుంట గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలు... గురజాల మండల జంగమహేశ్వపురం గ్రామానికి చెందిన శీలం ఏడుకొండలు (54) డప్పు కళాకారుడు. వినుకొండలో కోలాటం భజన కార్యక్రమంలో భాగంగా బైకుపై వస్తున్నాడు. వినుకొండ నుంచి వనికుంట గ్రామంలో తన అన్నయ్యను చూసేందుకు నాళ శ్రీను బైకుపై వస్తున్నాడు. అతను ఆటోను ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న ఏడుకొండలు బైకును ఢీకొట్టాడు. ఈ ఘటనలో శీలం ఏడుకొండలు తలకు బలమైన గాయాలు కావటంతో ఘటనా స్థలంలో మృతి చెందాడు. బైకుపై వస్తున్న మరో వ్యక్తికి గాయాలు కావటంతో 108 వాహనంలో వినుకొండ వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శీలం ఏడుకొండలు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి శవ పంచానామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. రెండు బైకులు పూర్తిస్థాయిలో దెబ్బతినగా పోలీసుస్టేషనుకు తరలించారు.

అందలమెక్కించిన ఆత్మవిశ్వాసం

- స్కూల్ అసిస్టెంట్ (ఫిజిక్స్)లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 6వ ర్యాంకు
- పీజీటీ ఫిజిక్స్‌లో 17వ ర్యాంకు
- టీజీటీ ఫిజిక్స్‌లో 20వ ర్యాంకు
- డీఎస్సీలో ప్రతిభ చాటిన మాడుగుల యువకుడు



గురజాల: ఆత్మవిశ్వాసం ఆ వ్యక్తిని అందలమెక్కించింది. ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ ఫలితాల్లో మండల పరిధిలోని మాడుగుల గ్రామానికి చెందిన పల్లపాటి రాఘవయ్య ఒకే విడతలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయి ఆదరించే వారు లేని పరిస్థితుల్లో తల్లి కష్టపడి బీఈడీ చదివించింది. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా తీర్చిదిద్దింది. ఇటీవల విడుదైన మెగా డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్‌లో జిల్లా స్థాయిలో 6వ ర్యాంకు, పీజీటీ ఫిజిక్స్‌లో 17వ ర్యాంకు, టీజీటీ ఫిజిక్స్‌లో 20వ ర్యాంకు సాధించాడు. ఇప్పటికే రాఘవయ్య తెనాలి మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్నాడు. 2018 డీఎస్సీలో ఆయన ఎస్జీటీగా ఎంపికయ్యాడు. తాజాగా విడుదల చేసిన డీఎస్సీలో మూడు ఉద్యోగాలకు ఎంపికై సత్తా చాటాడు.